క్లుప్తంగా

నమో శివరుద్రాయ



సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామికి బిల్వపత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

కార్మికుల సమస్యలపై చర్చ



ఉద్యోగులు, యూనియన్ ప్రతినిధులతో బాబర్ సలీం పాషా

పరవాడ: ఎన్ఎంయూఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాబర్ సలీం పాషా సోమవారం సింహాద్రి ఎన్టీపీసీలో యూనియన్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా, హెచ్‌వోడీతో ప్రత్యేకంగా సమావేశమై చర్చలు జరిపారని ఎన్టీపీసీ ఎన్ఎంయూఎస్ ప్రధాన కార్యదర్శి బొండా భీమరాజు తెలిపారు. ఈ సందర్భంగా బాబర్ సలీం పాషాను యూనియన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.జె.పి లెలిన్, యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోగినాయుడుకు ఏయూ డాక్టరేట్

సబ్బవరం: ఆంధ్రా యూనివర్సిటీ లా విభాగంలో పరిశోధన చేసిన దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వ విద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ పిన్నింటి జోగినాయుడుకు డాక్టరేట్ లభించింది. ఆచార్య వి.విజయలక్ష్మి పర్యవేక్షణలో లీగల్ డైమన్స్ న్యూ ఆఫ్ లాస్ ఆఫ్ లైఫ్ ఆర్ ప్రాపర్టీ డ్యూరింగ్ ఎయిర్ ట్రావెల్, స్కోప్ ఆఫ్ కాంపెన్సే సేన్ ఇన్ ఇండియా అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి చాంబర్‌లో ఆచార్య కృష్ణ మోహన్, ఆచార్య వి.విజయలక్ష్మి చేతుల మీదుగా జోగినాయుడు పీహెచ్‌డీ ప్రొసీడింగ్స్ అందుకున్నారు.

బాలిక అదృశ్యం

మర్రిపాలెం: ఓ బాలిక అదృశ్యమైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఒడిశా రాష్ట్రం రూర్కెలాకు చెందిన ఫలక్ పర్వీన్ కొన్ని నెలలుగా జ్ఞానాపురం గెడ్డ వీధిలోని తన మావయ్య మహమ్మద్ సలీమ్ రజా కుటుంబంతో కలిసి నివసిస్తోంది. ఈ నెల 10న మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన పర్వీన్ తిరిగి రాలేదు. అన్ని చోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సోమవారం బాలిక మావయ్య కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

మానవత డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: మానవత స్వచ్ఛంద సంస్థ వార్షిక డైరీని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సోమవారం ఉదయం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వివిధ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో తీర్చిదిద్దిన ఈ డైరీని ఆవిష్కరించి చైర్మన్ ఆచార్య ఆర్.సుదర్శనరావుకు బహూకరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఉపాధ్యక్షులు ఆచార్య కె.పరమేశ్వరరావు, ఆచార్య బి.సుధాకరరెడ్డి, ఆచార్య టి.వి.కృష్ణ, డాక్టర్ కె.రాజశేఖర్, డాక్టర్ వి.వి.ఎస్.రామకృష్ణ, ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎ.కె.ఎం.పవార్ పాల్గొన్నారు.

శరవేగంగా ప్రభుత్వ భవనాల నిర్మాణం



వాడచీపురుపల్లిలో ప్రారంభానికి సిద్ధంగా గ్రామ సచివాలయ భవనం



శరవేగంగా సాగుతున్న కలపాక వెల్‌నెస్ సెంటర్ నిర్మాణ పనులు

పరవాడ: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. నిర్మాణ పనులు సత్వరమే పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. మండలంలో 14 గ్రామ సచివాలయాలు, 11 రైతు భరోసా కేంద్ర భవనాలు నిర్మిస్తున్నారు. గ్రామ సచివాలయ భవనాల్లో ఇటీవల 5 పూర్తి చేసి ప్రారంభించారు. ప్రస్తుతం కలపాక, గొర్లివానిపాలెం, వాడచీపురుపల్లి-1 గ్రామాల్లోని గ్రామ సచివాలయ భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. అలాగే 11 రైతు భరోసా కేంద్రాల్లో వెన్నలపాలెం ఆర్‌బీకే భవనాన్ని ప్రారంభించారు. మిగిలిన 10 ఆర్‌బీకే భవనాల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణ పనులను చకచకా పూర్తి చేయడానికి సన్నాహాలు ప్రారంభించారు. రావాడలో రూ.25 లక్షలతో చేపట్టిన గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తిచేశారు. కలపాక, వెన్నలపాలెం, పెదముషిడివాడ, ముత్యాలమ్మపాలెం, మామిడివానిపాలెం గ్రామాల్లో చేపట్టిన రైతు భరోసా కేంద్ర భవనాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నాయుడుపాలెంలో రూ.16 లక్షలతో చేపట్టిన డిజిటల్ లైబ్రరీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

పనులు సత్వరమే పూర్తికి చర్యలు

ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు చక చకా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాం. మూడు గ్రామ సచివాలయ భవనాల నిర్మాణ పనులు పూర్తికావచ్చాయి. త్వరలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చేతుల మీదుగా ప్రారంభించడానికి సిద్ధం చేశాం. రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం.

– గండి రామారావు,
పంచాయతీరాజ్ ఏఈ పరవాడ

రైతుల సంక్షేమమే జగన్ లక్ష్యం

- ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- అట్టహాసంగా పెందుర్తి పీఏసీఎస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న శరగడం నరసింహమూర్తిని అభినందిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి అన్నారు. పెందుర్తి పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ శరగడం నరసింహమూర్తి ప్రమాణ స్వీకారం కార్యక్రమం సోమవారం పెందుర్తి పీఏసీఎస్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో చైర్మన్ నరసింహమూర్తి ,వైస్ చైర్మన్‌గా గొల్లవిల్లి భాస్కరరావు, డైరెక్టర్‌గా గోవింద్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ సత్యవతి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి రైతు బాంధవుడుగా పేరుతెచ్చుకున్నారన్నారు. తండ్రి ఒక అడుగువేస్తే ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్ రెండు అడుగులు ముందుకేసి రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్నారన్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతల చెంతకు ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి తెచ్చారన్నారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. పీఏసీఎస్ చైర్మన్ శరగడం నరసింహమూర్తి మాట్లాడుతూ తన పుట్టిన రోజునాడే పీఏసీఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న తన సేవలు గుర్తించి తనకు పదవి ఇచ్చిన ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బైలపూడి భగవాన్ జయరామ్, 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు తదితరులు పాల్గొన్నారు.

కథల్లో నీతిని గ్రహించాలి



పిల్లలకు అందించిన పుస్తకాలతో రచయిత ఇందూరమణ, గ్రంథాలయాధికారి నరసింహం

సింహాచలం: మంచి కథలు చదివి అందులో నీతిని గ్రహించాలని ప్రముఖ రచయిత ఇందూ రమణ అన్నారు. అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞా శిక్షణ శిబిరంలో సోమవారం పిల్లలకు కథలు చదివించి, కథలు రాయడంలో మెలకువలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథలు చదవడమే కాకుండా వినడం ద్వారా కూడా పిల్లల మానసిక వికాసానికి దోహదపడుతుందని తెలిపారు. బాలల కథల పుస్తకాలు విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వి. నరసింహం, స్థానిక వక్త ఏవీఎస్. భాను, కె. మురళి, గ్రంథాలయ ఉద్యోగి యల్లమ్మ, పాఠకులు మోహన్, కిరణ్, వనజ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ముట్టడి విజయవంతం చేయాలని పిలుపు



ఉక్కు మెయిన్ గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడిని విజయవంతం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలన్న డిమాండ్‌పై ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న ముట్టడికి చెందిన ప్రచార కార్యక్రమం సోమవారం ప్లాంట్‌లోని వివిధ విభాగాలు, కూడళ్లు, అన్ని గేట్ల వద్ద నిర్వహించారు. ఇందులో నాయకులు మాట్లాడుతూ సెయిల్‌లో 2021 డిసెంబర్ నుంచి నూతన వేతనాలు అమలు చేయగా ఇక్కడ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. దాని వల్ల కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. వెంటనే యాజమాన్యం స్పందించి వేతన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం



823వ రోజు ఉక్కు దీక్షలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పోరాడాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 823వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న సంస్థలోని పలు విభాగాల కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వం తహతహలాడుతోందన్నారు. విశాఖ ఉక్కు జోలికి వస్తే కార్మికులు, నిర్వాసితులు, ఆంధ్రరాష్ట్ర ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. దీక్షలు చేపట్టి సంవత్సరాలు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. విశాఖ ఉక్కును కొనడానికి ఎవ్వరూ వచ్చినా అడ్డుకుంటామని, పోరాటాలు, ప్రాణత్యాగాలతో ఏర్పాటైన కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్‌పరం కానివ్వమన్నారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

రెజ్లర్లకు సంఘీభావంగా నిరసన

మహారాణిపేట : ఢిల్లీలో మహిళా రెజ్లర్ల న్యాయమైన పోరాటానికి ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యు, పీడీఎస్‌యూ సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలనే డిమాండ్‌తో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి కలెక్టర్‌కు స్పందనలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు నిరసనకారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు జోక్యంతో ఎఫ్ఐఆర్ విడుదల చేసినప్పటికీ, నేటి వరకు బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. అతన్ని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి కె.నిర్మల, పివోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సర్ ఆర్థర్ కాటన్‌కు ఘన నివాళి



కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో సర్ ఆర్థర్ కాటన్ జయంతి నిర్వహించారు. ముందుగా విభాగం వద్దనున్న కాటన్ విగ్రహానికి పూలమాల వేసి ఆచార్యులు నివాళులర్పించారు. అనంతరం 'ట్రెండింగ్ ప్రాక్టీసెస్ ఇన్ సివిల్ ఇంజినీరింగ్'అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. సదస్సును విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, ఆచార్య వజీర్ మహ్మద్, సాంకేతిక, పరిశ్రమల నిపుణులు బ్రహ్మాజీ రావు, బోయిన, ఆచార్య జి.మురళీకృష్ణ, విభాగ పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వ్యక్తిత్వ వికాస తరగతులు

- వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహణ
- పేర్ల నమోదుకు ఆహ్వానం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి కళాశాలల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, లంకా వెంకట సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగిన దృష్ట్యా వ్యక్తిత్వ వికాసం ప్రాధాన్యం పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులు తడబాటు లేకుండా తమ భావాలను వ్యక్తపరచడంతో పాటు జీవన నైపుణ్యాల అభివృద్ధి, కెరీర్ ప్లానింగ్ వంటి అంశాలపై నిపుణులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కు ఆవరణలో నాలుగు రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు వేసవి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఇంటర్మీడియట్, ఆపైన చదువుకుంటున్న విద్యార్థులందరూ హాజరు కావచ్చని చెప్పారు. విద్యార్థులు తమ పేర్లను వాకర్స్ పార్కులోని కార్యాలయంలో నేరుగా లేదా 94901 84360, 83091 57522, 94404 01874 ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సమస్యల పరిష్కారం కోరుతూ వినతి

మహారాణిపేట : సమస్యలు పరిష్కరించాలని డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 104 ఎంఎంయూ వాహన సేవలు గతంలో వలె రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, ముఖ్యమంత్రి హామీ మేరకు 104 ఎంఎంయూ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, ప్రతినెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ 104 ఎంఎంయూ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు బి. తాతబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే ఖాసిం, కోశాధికారి పి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పందుల నియంత్రణకు చర్యలు తీసుకోండి

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశం
- 95వ వార్డులో క్షేత్రస్థాయి పర్యటన



95వ వార్డులో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సింహాచలం: పందులను నియంత్రించాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ 8వ జోన్‌లోని 95వవార్డు పాపయ్యరాజు పాలెం,సుజాతనగర్, మహతి స్కూల్ దిగువ ఏరియా తదితర ప్రాంతాల్లో కమిషనర్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 95వ వార్డులో పందులు అధికంగా ఉన్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. వెంటనే వాటిని నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పారిశుధ్య పనులు కూడా సరిగ్గా జరగడం లేదని అసహనం వ్యక్తం చేశారు. వార్డులో చాలా చోట్ల పిచ్చి మొక్కలు చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు జరగాలని, పిచ్చి మొక్కలను యుద్ధప్రాతిపదికన తొలగించాలని ఆదేశాలు జారీచేశారు. వార్డులో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించిన కమిషనర్ వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తయిన వెంటనే గోతులు పూడ్చాలని సూచించారు. అలాగే భవన నిర్మాణ వ్యర్థాలను చాలా చోట్ల గమనించిన ఆయన హెచ్చరికలు జారీ చేశారు. వెంటనే వాటిని తొలగించాలని జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడును ఆదేశించారు.

నూతన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

బోధనలో మెలకువలపై అవగాహన



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యయులు

సింహాచలం: ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడానికి అవసరమైన మెలకువలు ఉపాధ్యాయులు తెలుసుకోవాలని జిల్లా విద్య శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ యు. మాణిక్యం నాయుడు సూచించారు. నూతంగా ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన 1998,2008,2018 సంవత్సరాలకు సంబంధించి మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులకు సోమవారం నుంచి పెందుర్తిలోని శ్రీ చైతన్య పాఠశాలలో మొదటి విడత బ్యాచ్ శిక్షణ తరగలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి 300 మంది ఉపాధ్యాయులు ఈశిక్షణ తరగతులకు హాజరయ్యారు. మాణిక్యం నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్సీఆర్టీ ప్రొఫెసర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 50 మంది ఉపాధ్యాయులకు నలుగురేసి రిసోర్స్ పర్సన్లు చొప్పున తెలుగు, ఇంగ్లిషు, పరసరాల విజ్ఞానం, గణితం, సాధారణ అంశాలు, విద్యలో సాంకేతికత వినియోగం తదితన అంశాలపై శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు గొట్టేటి రవి, రిసోర్స్ పర్సన్లు ఉమా గుప్త, దొర, ప్రసన్న కుమార్, సోమయాజులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌ను ఢీ కొట్టిన లారీ

లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలు



క్యాబిన్‌లో ఇరుక్కున్న లారీ డ్రైవర్ చంబూరాజ్ బహర్

సబ్బవరం: అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారిలో ఇరువాడ వద్ద సోమవారం రెండు వాహనాలు ఢీ కొట్టుకున్న ఘటనలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు దరి చేబ్రోలులో ఓ హేచరీ నుంచి చేపల లోడుతో లారీ ఆదివారం 11 గంటలకు కోల్‌కతా బయలుదేరింది. సోమవారం ఉదయం ఇరువాడ సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న వాటర్ ట్యాంకర్‌ను చేపల లోడు లారీ వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడి క్యాబిన్‌లో ఇరుక్కు పోయాడు. పోలీసులు క్రేన్ సాయంతో డ్రైవర్‌ను బయటకు తీయించారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ రెండు కాళ్లు విరిగిపోయినట్లు సబ్బవరం హెచ్‌సీ సత్యనారాయణ చెప్పారు. క్షతగాత్రుడిని 108 లో అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. సబ్బవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నూతన ఒరవడి తీసుకువచ్చారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే లక్ష్యంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. జీవీఎంసీ 97వవార్డు 495 సచివాలయం పరిధిలోని సత్యనారాయణపురం, సావిత్రినగర్‌లో సోమవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే తగిన చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సేవా సంఘం నూతన కమిటీ నియామకం

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం సమావేశం సోమవారం సంఘ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సంఘం ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి రాష్ట్రస్థాయి కమిటీ సభ్యులను నియమించారు. అధ్యక్షుడిగా కొణతాల శ్రీనివాస్ (విశాఖపట్నం), సలహా కమిటీ చైర్మన్‌గా రిటైర్డ్ జడ్జ్ బి. రామారావు (శ్రీకాకుళం), రాష్ట్ర అధికార ప్రతినిధిగా బమ్మిడి గంగాధర్ (శ్రీకాకుళం), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్. రామకృష్ణ నాయుడు (శ్రీకాకుళం), కోశాధికారిగా ఎం. ఉమామహేశ్వరరావు(విశాఖపట్నం), రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఆలేటి హేమలత (విశాఖపట్నం), సీహెచ్ వెంకటేశ్వరరావు(విశాఖపట్నం), సనపల అన్నాజీరావు (శ్రీకాకుళం), జి. అప్పలనాయుడు (విజయనగరం), ఎం. ఎల్లారావు(అనకాపల్లి), అదనపు ప్రధాన కార్యదర్శులుగా కోటా రమేష్, కె. మధుసూదన్, రాఘవకుమార్, జి. వెంకట్రావు, కార్యదర్శులుగా కొప్పుల రామ్‌కుమార్, సన్యాసినాయుడు, జె. భాస్కర్, కె. అప్పలనరసమ్మ, సహాయ కార్యదర్శులుగా కొయ్య రామకృష్ణ, అప్పలరాజు, శ్రీనివాస్, కృష్ణారావు, అప్పన్న, పలువురు నిర్వహణ కార్యదర్శులు, సహాయక కోశాధికారి, సలహా కమిటీ సభ్యులను నియమించారు.

ఎంఎల్ఆర్ విభాగంలో ఆత్మీయ సమ్మేళనం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగంలో మిలీనియం బ్యాచ్(2000-2002) పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. ఇక్కడ చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు పలువురు కలుసుకుని అప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. విభాగ ప్రగతిని ప్రత్యక్షంగా వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు. విభాగ అభివృద్ధికి, ప్రస్తుత తరం విద్యార్థులకు ఉపాధి కల్పన, మార్గదర్శకం అందించడానికి తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు రమణమూర్తి, కె.రమేష్‌బాబు, ఏడుకొండలరావు, అధ్యాపకులు గణేష్, శిరీష తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభాగ ఆచార్యులను సత్కరించారు.